ప్రజాశక్తి
శనివారం 18 మే 2024 5 అనంతపురం





24 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈనెల 24వ తేదీ నుంచి వేరుశగన విత్తనకాయల పంపిణీ ప్రారంభం కానుంది. నేటి నుంచి వేరుశనగ విత్తనకాయలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు వేరుశనగ విత్తన సేకరణ ధరతోపాటు పంపిణీ ధరను నిర్ణయించారు. 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పంపిణీ ధర కిలో రూ.57

ఖరీఫ్‌లో ఈ ఏడాది కె-6, టిసిజిఎస్ 1694 రకం రెండు రకాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ట్రూత్‌ఫుల్ లేబుల్ విత్తనకాయలు కిలో రూ.95లు. సబ్సిడీ 40 శాతం ప్రకారం కిలో రూ.38 రాయితీ ఇచ్చారు. రైతుకు పంపిణీ చేస్తున్న ధర కిలో రూ.57. ఒక్కో రైతుకు విస్తీర్ణం బట్టి సరఫరా కేటాయించారు. అర ఎకరంలోపు 30 కిలోల బస్తా, సబ్సిడీపోను 30 కిలోల బస్తా రూ.1710 ఇవ్వనున్నారు. అర ఎకరం నుంచి ఒక ఎకరం వరకుంటే రెండు బస్తాలు, ఒక ఎకరంపై ఉన్న మూడు బస్తాలు ఇస్తారు. అంతరపంటల విత్తన సబ్సిడీలు నిర్ణయించాల్సి ఉంది.

81832 క్వింటాళ్లు కేటాయింపు

అనంతపురం జిల్లాకు 81832 క్వింటాళ్లు సబ్సిడీతో పంపిణీకి కేటాయించారు. వేరుశనగ విత్తనకాయలు 76710 క్వింటాళ్లు కేటాయించారు. కంది విత్తనాలు 2300 క్వింటాళ్లు, బ్లాక్ గ్రామ్ 46 క్వింటాళ్లు, పెసలు 85 క్వింటాళ్లు, రాగులు నాలుగు క్వింటాళ్లు, కొర్రలు 50 క్వింటాళ్లు, వరి 1600 క్వింటాళ్లు, దాంచియా 200 క్వింటాళ్లు, పిల్లిపెసర 25 క్వింటాళ్లు, ఉలవలు 700 క్వింటాళ్లు, కౌవ్‌పీ106 క్వింటాళ్లు, సన్‌హెప్ 7 క్వింటాళ్లు మొత్తం 81832 క్వింటాళ్లు కేటాయించారు. ఈ మేరకు మండలాల వారీగా కేటాయింపులు పూర్తయ్యాయి. విత్తన సేకరణకు అధికారులు సమయత్తమయ్యారు.

విత్తన సేకరణకు సీడ్ మానిటరింగు సెల్

సార్వత్రిక ఎన్నికల విధుల్లోనున్న అధికార యంత్రాంగం ఇప్పుడు విత్తన సేకరణపై దృష్టి సారించింది. తక్కువ సమయం కావడంతో విత్తన సేకరణ వేగవంతం చేయడంపై దృష్టి సారించారు. గత ఏడాది సేకరణలో కొంత సమస్య తలెత్తి పంపిణీలోనూ జాప్యం జరిగింది. ఈసారి అలా కాకుండా ఉండే విధంగా ముందస్తు చర్యలు తీసుకునేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఇందుకోసం సీడ్ మానటరింగు సెల్‌ను జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ ఏర్పాటు చేశారు. విత్తన సేకరణ, నాణ్యతను ఆయన శుక్రవారం స్వయంగా పరిశీలించారు.

అభివృద్ధి పనులకు ఆటంకం

ఎన్నికల కోడ్‌తో పడకేసిన అభివృద్ధి
ముందుకుసాగని వ్యవసాయం, విద్య, ఇతర అభివృద్ధి పనులు
ఇబ్బందుల్లో ఉమ్మడి జిల్లా ప్రజలు



పుట్లూరు మండలంలో తాగునీటి సమస్యపై సచివాలయాన్ని ముట్టడించిన మహిళలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత రెండు నెలలుగా ఎన్నికల వేడి నెలకొంది. ఎక్కడ చూసిన రాజకీయ వాతావరణమే కన్పించింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రతి అంశం రాజకీయం చుట్టూనే తిరిగింది. అన్ని శాఖల అధికారులు ఎన్నికల పనుల్లోనే బిజీ అయ్యారు. ఈ నెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్ ముగిసేంత వరకు అధికారులు ఆ పనుల్లోనే నిమగ్నం అయ్యారు. జూన్ 4వ తేదీన ఫలితతాలు వెల్లడయ్యే వరకు ఇంకా ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో సాధారణ సమస్యల పరిష్కారం, ఇతర అభివృద్ధి పనులకు ఆటంకం నెలకొంది.

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి నేపథ్యంలో ప్రజా సమస్యలు సైతంపరిష్కరించలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పనులకు సైతం ఎన్నికల నుంచి అనుమతి తీసుకోవల్సిన ఉండడంతో అభివృద్ధి పనులు ప్రారంభించలేని పరిస్థితి ఉంది. ఎన్నికల ఫలితాల తర్వాత బదిలీలు ఉంటాయనే ప్రచారం నేపథ్యంలో అధికారులు ఆయా మండలాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదు. అధికారులంతా కేవలం ఎన్నికల పనులకే ప్రాధాన్యతను ఇస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, గ్రామాల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి ఎన్నికల కోడ్ అవాంతరంగా మారింది. సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలకు ప్రజలు వెళ్తే తాము ఎన్నికల విధుల్లో ఉన్నామనే మాట అధికారుల నుంచి వ్యక్తం అవుతోంది.

వన్-బి కష్టాలు

ప్రస్తుతం పంట రుణాల రెన్యూవల్ పనులు కొనసాగుతున్నాయి. ఆయా బ్యాంకుల్లో రుణాల రెన్యూవల్‌కు సంబంధించి రైతులు వెళున్నారు. అయితే ఈ ఏడాది రైతులకు కొత్త కష్టం వచ్చి పడింది. ఇటీవల ప్రభుత్వం చేసిన భూ రీ సర్వే కారణంగా చాలా గ్రామాల్లో రైతులకు సంబంధించి వన్-బి వివరాలు ఆన్‌లైన్‌లో కన్పించడం లేదు. దీంతో రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వన్-బి వివరాలను సరి చేసి ఆన్‌లైన్‌లో ఉంచాలని కోరుతూ అన్ని మండలాల్లోనూ రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తాము ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పొలాలకు సంబంధించి వన్-బి వివరాలు ఆన్‌లైన్‌లో లేవని, దీని వల్ల బ్యాంకర్లు పంట రుణాల రెన్యూవల్ చేసుకోవడం లేదని, తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు. కాగా ప్రస్తుతం ఆయా తహశీల్దార్ కార్యాలయాలకు ఎన్నికల విధుల నిమిత్తం వచ్చిన అధికారులు విధుల్లో ఉన్నారు. ఈ అధికారులు ఈ సమస్యలపై పూర్తి స్థాయిలో స్పందించడం లేదు. ఈ సమస్యను ముట్టుకుంటే ఆ తర్వాత తమకేమి ఇబ్బందులు వస్తాయన్న భావంతో అన్నింటికీ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతున్నారు. రైతుల మాత్రం తక్షణం వన్-బి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం

మరో పది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి. ఈ వారంలో వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే తెలియజేశారు. ఈ నేపథ్యంలో రైతన్నలు సాగుకు సమాయాత్తం అవుతున్నారు. ఈ వారంలో వర్షాలు పడితే పొలంలో దుక్కుల పనులు ప్రారంభం అవుతాయి. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో రైతులు వేరుశనగ పంటలను సాగు చేస్తారు. ఈ పంటకు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తుంది. ఈ సబ్సిడీ విత్తనాలు తీసుకునే ఎక్కువ మంది రైతులు పంటలు సాగు చేసే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రైతులకు సరపరా విత్తన సరఫరా, ఎరువుల సరఫరా చేయాల్సుంది.

స్పందన గ్రీవెన్స్ లేదు..!

కలెక్టరేట్, మండల కేంద్రం, ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం ఎన్నికల కోడ్ కారణంగా రద్దు అయ్యింది. గత ఐదు వారాలుగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించలేదు. ఈ కార్యక్రమం ఉంటే వ్యక్తిగత, గ్రామ సమస్యలపై ప్రజలు అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించమని కోరేవారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. గ్రీవెన్స్‌ను పునరుద్ధరిస్తే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

తాగునీటి సమస్యలు

వేసవి కాలం ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉంది. ఎన్నికల కోడ్ ఉన్నా తాగునీటి సమస్య పరిష్కారంపై మాత్రం అధికారులు సమీక్షలు నిర్వహించి ఆ సమస్యకు పరిష్కారం చూపేలా ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులందరూ ఎన్నికల విధుల్లో ఉన్న కారణంగా ఈ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపలేక పోయారు. పూర్తి స్థాయిలో నిధులు మంజూరు అయితేనే ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఇందుకు సంబంధించి నిధులు మంజూరు కావాలన్నా ఎన్నికల కోడ్ ముగియాల్సి ఉంది.

కొత్త విద్యా సంవత్సరం మొదలు

మరో 25 రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. పాఠశాలలకు సంబంధించి జూన్ 12వ తేదీ నాటికి వేసవి సెలవులు ముగిస్తాయి. అప్పటి నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేలోగా అక్కడ మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత సంబంధిత విద్యాశాఖ అధికారులపై ఉంది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పాఠశాలలను ఎన్నికల పోలింగ్‌కు నిమిత్తం తీసుకున్నారు. దీంతో పాఠశాలల్లో ఎలాంటి అభివృద్ధి పనులు సాగలేదు. జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఇప్పుడు కూడా అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యే అవకాశం కన్పించలేదు. పాఠశాలల్లో కనీసం మరమ్మతు పనులు చేసేందుకు సైతం వీలు ఉండని పరిస్థితులు ఈ ఏడాది కన్పిస్తున్నాయి.

ఆటోలకు గ్యాస్‌ను అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆటో కార్మికులకు గ్యాస్ సదుపాయం 24 గంటలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సిఐటియు అనుబంధం భగత్‌సింగ్ ఆటో యూనియన్ నగర అధ్యక్షుడు షేక్ ఆజాం బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కోర్టురోడ్డులో సిఎన్‌జి గ్యాస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొల్యూషన్ ఫ్రీ కోసం ఆటో కార్మికులు గ్యాస్ ఆటోలను నడుపుతున్నారని తెలిపారు. ఆటో రంగంపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఒక్క రోజు పని లేకపోయిన కుటుంబాలు గడవడం కష్టంగా ఉంటుందన్నారు. గ్యాస్ ఆటోలకు గ్యాస్ సరఫరాలో జాప్యం జరుగుతోందన్నారు. 20 రోజులుగా గ్యాస్ కొరత ఏర్పడిందన్నారు. దీంతో పెట్రోల్ వినియోగించి ఆటోలు బాడుగలు నడుపుతున్నారని తెలిపారు. దీంతో ఆటో డ్రైవర్‌లకు డబ్బులు మిగిలే పరిస్థితి లేదన్నారు. మైలేజ్ రాదన్నారు. ఇటు పొల్యూషన్ కూడా ఏర్పడుతోందన్నారు. కావునా ఆటోలకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సిఎన్‌జిసి కంపెనీ జిల్లా ఇన్‌చార్జి ఇంద్రజిత్‌ను కలిసి సమస్యలపై వివరించారు. స్పందించిన ఆయన 48 గంటలు గడువు ఇవ్వాలని, అనంతరం 24 గంటలు గ్యాస్ అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్ ఆటో యూనియన్ కోశాధికారి రామలింగారెడ్డి, నాయకులు విశ్వ, శీనా, నారాయణస్వామి, మహిళా ఆటో డ్రైవర్ కవిత, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే హింసాత్మక దాడులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుందని, ఓటమిని అంగీకరించలేక హింసాత్మక దాడులకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని తెలుగుదేశం పార్టీ అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ అన్నారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు ద్వారా తీర్పు ఇవ్వబోతున్నారని, ఎన్నికల్లో అది స్పష్టంగా వైసిపి నాయకులు గ్రహించే దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. తాడిపత్రిలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జెసి అస్మిత్ రెడ్డి కుటుంబంపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అనుచరులు, వైసిపి గుండాలు దాడులు చేశారని తెలిపారు. ధర్మవరం వైసిపి రౌడీలు తాడిపత్రికి వచ్చి అల్లర్లు సృష్టించారని తెలిపారు. పోలింగ్ ముందు రోజు నుంచే పక్కా ప్రణాళిక ప్రకారం వైసిపి నాయకులు అల్లర్లు సృష్టించారని, పోలీసు వాహనాలపైనే రాళ్లదాడులకు తెగబడ్డారని తెలిపారు. శాంతిభద్రతలు కాపాడటంలో జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. అతి సున్నితమైన సమస్యాత్మకమైన నియోజకవర్గంలో పటిష్టం పోలీసు బందోబస్తు చేపట్టకుండా తూతూ మంత్రంగా పోలీసులు వ్యవహరించడం వల్లే హింసలు చెలరెగడానికి ఆస్కారం కల్పించారన్నారు. వైసిపి, టిడిపి ఇరు వర్గాలను సమన్వయం చేసి ఉండాల్సి ఉందన్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్ల తాడిపత్రిలో హింసాత్మక ఘటనలు జరిగాయని తెలిపారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు యంత్రాంగం స్పందించి ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లాలో అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. జూన్ 4వ తేదిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉన్న నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసుల వైఫల్యంతోనే తాడిపత్రి ఘటనలు
టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

ఆగని వసూల్‌రాజా ఆగడాలు

నోటీసుల పేరుతో బెదిరింపులు
చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు



కదిరి మున్సిపల్ కార్యాలయం




ప్రజాశక్తి - కదిరిటౌన్

కదిరి మున్సిపాలిటీలో అవినీతి రోజురోజుకు రాజ్యమేలుతోంది. మున్సిపాలిటీలోని ఓ వసూళ్ల రాజా ఆగడాలు హద్దే లేకుండా పోతోంది. వసూళ్ల పర్వానికి ఒక్కోసారి ఒక్కో మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. సెలవు కావాలన్నా , కార్మికుల బీమా చెల్లించాలన్న, ప్రొహబిషన్ డిక్లరేషన్ అయినా ఆయనకు మామూళ్లముట్ట చెప్పాల్సిందే. గతంలో ఈయనగారి అవినీతి భాగోతాన్ని ప్రజాశక్తి బట్టబయలు చేస్తే ఉన్నతాధికారుల హెచ్చరికలతో కార్మికుల నుంచి తీసుకున్న సొమ్మును ముట్టజెప్పాడు. రోజులు తన అవినీతి పర్వానికి కామా పెట్టాడు. 'కుక్కతోక వంకర ' అన్న చందంగా తిరిగి ఆ అధికారి తమ అవినీతి భాగోతానికి తెరలేపినట్లు తెలుస్తోంది. తాజాగా మరో రకం ఎత్తుగడకు తెరలేపాడు. మున్సిపల్ పరిధిలోని ఓ సచివాలయంలో పనిచేసే మహిళ చిరుద్యోగి తన కొడుకుకు పక్క జిల్లాలో పరీక్ష రాయించేందుకు గాను మున్సిపల్ కమిషనర్‌ని ఒకరోజు సెలవు అడిగినట్లు సమాచారం. ఎన్నికలు వేళ సెలవు మంజూరు చేయడం కుదరదని మున్సిపల్ ఉన్నతాధికారి చెప్పాడు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో తన కుమారుడి పరీక్ష హాజరు నిమిత్తం కొడుకును వెంట పెట్టుకొని ఆ చిరుద్యోగి పక్కజిల్లాకు వెళ్లివచ్చింది. అది గుర్తించిన అధికారులు విచారణ పేరుతో చిరుద్యోగికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీంతో ఆ ఉద్యోగి తన సమస్యను ఉన్నతాధికారికి విన్నవించి తనపై చర్యలు తీసుకోవద్దని బతిమలాడింది. సరిగ్గా ఈ సమయంలోనే వసూల్‌రాజా రంగప్రవేశం చేశాడు. ఆ ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వసూళ్ల పర్వానికి తెరలేపాడు. దీంతో ఆ ఉద్యోగి చేసిది లేక రూ.4వేలు ఇవ్వడానికి సిద్ధమవ్వగా వసూల్‌రాజా రూ. 10వేలు ఇవ్వాల్సిందేనని పట్టుపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. వసూల్‌రాజా అవినీతి భాగోతానికి ఇది కేవలం శాంపిల్‌మాత్రమే. ఇలా పలురకాలైన వాటిపై వసూల్‌రాజా కన్నేసి తన వసూళ్లదందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. వసూల్‌రాజాపై ఇన్ని ఆరోపణలు వస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా కనీసం ఈ ఆరోపణలపై స్పందించిన దాఖలాలు కూడా లేవు. దీంతో వారి తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబందిత ఉన్నతాధికారులు స్పందించి వసూల్‌రాజా భాగోతంపై విచారణ జరిపి మున్సిపాలిటీలో తిష్టవేసిన అవినీతి కుంపటిని తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కురిసింది వాన..

ప్రజాశక్తి - అనంతపురం

నైరుతి రుతు పవనాల ప్రభావంతో శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు చోట్ల వర్షాలు పడ్డాయి. ఓ మోస్తరు నుంచి ఉరుములతో కూడిన వర్షాలు కురిసాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బొమ్మనహాల్, మడకశిర, కదిరి ప్రాంతాలతో పాటు అనంతపురం నగర చుట్టుపక్కల మండల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. బొమ్మనహాల్ మండలంలో కురిసిన వర్షాలకు రైతులకు తీరని నష్టం వాటిల్లింది. రబీలో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ కోత దశకు వచ్చింది. పంటనూర్పిడి చేసి రైతుల వేరుశనగ ఈ వర్షానికి తడిచిపోయాయి. వరిపంట నేలవాలింది. గాలికి బత్తాయి, దానిమ్మ, అంజూర కాయలు నేలరాలాయని రైతులు వాపోయారు. ఇక మడకశిరలో భారీవర్షానికి పట్టణం జలమయమైంది. వాగులు, వంకలు పొంగిపోర్లాయి. కదిరి పట్టణంలో భారీ వర్షం కురిసింది. ఎండవేడిమికి, ఉక్కపోతకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉమ్మడి జిల్లా ప్రజలకు శుక్రవారం కురిసిన వర్షం కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది. వర్షం రాకతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొలిదుక్కులు చేసుకోవచ్చుని అంటున్నారు



మడకశిర మండలంలోని జమ్మనపల్లిలో ప్రవహిస్తున్న వాగు



కదిరిలో కురిసిన వర్షానికి జలమయమైన రోడ్డు

సిబిఎస్ఇ బోధనపై టీచర్లకు శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగర శివారు రాప్తాడు మోడల్ పాఠశాలలో ఎంపిక చేసిన 115 మంది టీచర్లకు సిబిఎస్ఇ బోధనపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఇఒ బి.వరలక్ష్మి మాట్లాడుతూ సిబిఎస్ఇ విద్యను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో ఎంపిక చేసిన మోడల్ స్కూల్స్, కేజీబీవీ స్కూల్స్, గవర్నమెంట్ హైస్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సిబిఎస్ఇ అమలవుతుందన్నారు. సిబిఎస్ఇ అమలవుతున్న పాఠశాలల టీచర్లకు రెండు విడతల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 17, 18వ తేదీల్లో మ్యాథ్స్, ఫిజికల్, సైన్స్ టీచర్లకు, 21, 22వ తేదీల్లో సోషియల్, ఇంగ్లీష్ సబ్జెక్టు టీచర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి లెసన్ ప్లాన్ మ్యాడిల్స్‌ను ఇదివరకే అందజేశామన్నారు. ఈ శిక్షణలో శిక్షకులు చెబుతున్న ప్రతి అంశాన్నీ శ్రద్ధగా విని డైరీలో రాసుకుని మీ పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధన చేయాలన్నారు. రాష్ట్ర పరిశీలకులు నాగమాధవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉశిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. కోర్స్ డైరెక్టర్‌గా అనంతపురం డిప్యూటీ డిఇఒ శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి డివైఇఒ శ్రీదేవి, ఎఎంఒ చంద్రశేఖర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు తడిసిన పంటలు

నేల కొరిగిన పండ్లతోటలు -లబోదిబోమంటున్న రైతులు



రంగు మారిన వేరుశనగకాయలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా వరి పంట నేలకొరిగింది. బత్తాయి, దానిమ్మ, అంజూర పళ్లు నేలరాలుతున్నాయి. దీంతో పంటలు సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని ఉద్దేహళ్, నేముకల్, దేవగిరి గ్రామాల్లో ఆయా పంటలతోపాటు వేరుశనగ పంటలు సాగు చేశారు. గాలివాన వస్తుండటంతో బత్తాయి, దానిమ్మ, అంజూర పళ్లు నేల రాలుతున్నాయి. ఇక వేరుశన పంటను కోసి కుప్పేసుకోగా తడిసిపోయి కాయలు మొలకలు వస్తున్నాయని బాధిత రైతులు దూదేకుల శర్మస్‌వలి, హొన్నూరుసాబ్, షేక్ అన్నావన్నూరు సాబ్, తదితరులు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఎకరాలో వేరుశనగ పంట సాగు చేయాలంటే దాదాపు రూ.50వేలు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం క్వింటా వేరుశనగా మార్కెట్‌లో రూ.6వేలు పలుకుతోంది. ఈ సమయంలో వర్షం వచ్చి వేరుశనగ పంట దెబ్బతినడంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. అరకొర ఉన్న కాయలు కూడా బూజు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే ఎల్బీనగర్‌లో అధికంగా బత్తాయి, దానిమ్మ, అంజూరు తోటలు సాగు చేశారు. ప్రస్తుతం పంటలు కోత దశలో ఉన్నాయి. ఈ సమయంలో గాలివాన వస్తుండటంతో కాయలు నేల రాలుతున్నాయి. అలాగే వరి పంట నేలకొరిగి పూర్తిగా నష్టాలపాలయ్యామని కృష్ణ రంగాపురం రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా రైతులు కోరుతున్నారు.



నార్పలలో డ్రెయినేజీకి అడ్డుపడిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ కార్మికుడు

వ్యాపారుల నిర్లక్ష్యం..

కార్మికులకు శాపం..!

కాలువల్లోకి దుకాణాల్లోని వ్యర్థాలు
ప్రాణాలకు తెగించి కార్మికుల పనులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని దుకాణదారులు, కిరాణా వర్తకుల నిర్లక్ష్యం.. పంచాయతీ కార్మికులకు శాపంగా మారుతోంది. మండల కేంద్రంలోని దుకాణాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా,చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పడవేస్తుండటంతో అవి డ్రెయినేజీలోకి వెళ్లి కాలువలు పూడిపోతున్నాయి. వీటిని తీస్తున్న కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా, చెదారాన్ని కాలువల్లో పడేయకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకుండి పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

డ్రెయినేజీలు నిండిపోతుండటంతో తీవ్ర దుర్గంధభరితమైన దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీనికితోడు కొందరు మలమూత్రాలను కూడా డ్రెయినేజీల్లోనే చేస్తున్నారు.

మండల కేంద్రంలో రోజూ పంచాయతీ వాహనం ఉదయం, సాయంత్రం మెయిన్ రోడ్డుతోపాటు పలు కాలనీల్లో వస్తోంది. ఈ వాహనంలో ప్రతి దుకాణదారులు, ప్రతి ఇంటి వ్యక్తీ విధిగా చెత్త, వ్యర్థాలను వేస్తే చాలావరకూ డ్రెయినేజీలు శుభ్రంగా ఉంటాయి. మురుగునీరు కూడా ఎక్కడా నిలబడకుండా పారుతూ ఉంటుంది. అయితే చాలామంది చెత్త వాహనాలకు చెత్త, వ్యర్థాలను అందివ్వడం లేదని కార్మికులు వాపోతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని గూగూడు రోడ్డులో ఉన్న దుకాణాల్లోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను నడిరోడ్డుపై పడవేస్తున్నారు. అలాగే నార్పలలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న మురుగు కాలువలు నిత్యం ప్లాస్టిక్, చెత్తాచెదారం నిండిపోయి దుర్వాసన వెదజల్లుతూనే ఉంటుంది.

పారిశుధ్య కార్మికులు కూడా మన కుటుంబ సభ్యుల మాదిరే కదా.. మనలాంటి మనుషులే కదా.. అని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే ఇష్టానుసారం రోడ్లపై చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయరని పలువురు అంటున్నారు. మనం ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో.. మన వీధిని కూడా అలాగే శుభ్రంగా ఉంచుకుంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని మానవతావాదులు, వేధావులు సూచిస్తున్నారు. అంతేగాకుండా అధికారులు కూడా నిత్యం పర్యవేక్షణ ఉండాలని కోరుతున్నారు. ప్రస్తుతం ప్రతిచోటా సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిని పరిశీలించి చెత్త ఎవరు రోడ్డుపై వేస్తున్నారో.. గుర్తించి భారీస్థాయిలో జరిమానా విధిస్తే ఎవరూ రోడ్డుపై చెత్త వేయరని సూచిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని మానవతావాదులు, వేధావులు, కార్మికులు కోరుతున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

రాష్ట్రస్థాయి యోగాసన పోటీల జడ్జిలకు శిక్షణ

అనంతపురం : నగరంలోని వేమన టెలిఫోన్ భవన్‌లో రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యోగాసన పోటీల జడ్జిలకు శుక్రవారం ఇచ్చారు. ఇందులో భాగంగా ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ శ్రీసాయికృష్ణ, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ హరిచంద్రరామ, రాష్ట్ర అధ్యక్షులు ఎ.రాధిక, అనంతపురం యోగాసన స్పోర్ట్స్ చీఫ్ పాట్రన్ రవికాంత్ రమణ, అధ్యక్షులు ఎం.రాజాశేఖరరెడ్డి, కార్యదర్శి మారుతీప్రసాద్, దివాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమణ, బాల సుబ్రమణ్యం, అనిల్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సుమన, నిర్మల శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో రాష్ట్రస్థాయి యోగాసన పోటీల జడ్జిలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

పామిడి : స్థానిక బైపాస్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి 331వ ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి అభిషేకం, పూజలు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు గోపాలస్వామి తెలిపారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని జక్కల వెంకట్రాముడు స్వామివారి ఆలయానికి వితరణ చేశారు. ఉత్సవ విగ్రహాన్ని పామిడి పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి కిషోర్‌స్వామి, బ్రహ్మయ్య ఆచారి, భక్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

తగ్గుపర్తి సచివాలయం తనిఖీ

బెలుగుప్ప : మండల పరిధిలోని తగుపర్తి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ సుబ్బరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా చాలా వరకూ ఇక్కడే పరిష్కరించాలని సూచించారు. విధులకు డుమ్మా కొడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శంకర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజ

తాడిపత్రి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలి

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు అనంత, విశ్వ, వీరాంజనేయులు



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత రోజు జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గంలో జరిగిన ఘటనలపై నిస్పక్షపాతంగా, లోతైన విచారణ చేయాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు అనంత వెంకటరామిరెడ్డి, వై.విశ్వేశ్వరరెడ్డి, ఎం.వీరాంజనే యులు డిమాండ్ చేశారు .శుక్రవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ఆదేశాలను ఎన్నికల కమిషన్ తూచా తప్పకుండా అమలు చేసిందన్నారు. ఇందులో భాగంగానే ఎన్నికలకు ముందే ఎస్పీ, డీఎస్పీలను బదిలీ చేసిందన్నారు. తాడిపత్రిలో ఎస్పీ పర్యవేక్షణలోనే ఎన్నికలు జరిగాయన్నారు. పక్కా ప్రణాళికతోనే ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై, కుటుంబ సభ్యులపై దాడి జరిగిందన్నారు. దాడులను నివారించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. టిడిపి అధినేతతోపాటు కూటమి నేతలు అడ్డదారిలో గెలవాలని ప్రయత్నించారన్నారు. ఇందులో భాగంగానే డిఐజిని, ఎస్పీని బదిలీ చేయించారన్నారు. ఉరవకొండలో టిడిపి అభ్యర్థి కేశకే నిందితులను ఏజెంట్లుగా నియమించుకున్నా ఎన్నికల కమిషన్ అడ్డు చెప్పలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాడిపత్రి ఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, తదితరులు పాల్గొన్నారు.

19న 'శ్రేయాస్ గ్రాండ్' ప్రారంభం

ముఖ్యఅతిథిగా సినీ హీరో శ్రీకాంత్



ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీనివాస్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రేయాస్ గ్రాండ్ లగ్జరీ రూమ్స్ అండ్ బ్యాంకెట్స్ నూతన షోరూమ్‌ను ప్రముఖ టాలీవుడ్ హీరో శ్రీకాంత్ 19న ప్రారంభించనున్నట్లు శ్రేయాస్ గ్రాండ్ అధినేత లక్ష్మీకాంతరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ప్రఖ్యాతి గాంచిన తిరుపతి బీమాస్ ప్యూర్ వెజ్ వంటకాలను అనంతపురం ప్రజలకు పరిచయం చేయడానికి తాము ఫ్రాంచైజీ తీసుకున్నట్లు తెలిపారు. రాయలసీమలో తిరుపతి, అనంతపురంలో బీమాస్‌ను ప్రజలకు చేరువచేయడం సంతోషకరంగా ఉందన్నారు. పూర్తిస్థాయి ప్యూర్ వెజ్ ఐటమ్స్ డిఫెన్స్ భోజనం ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అన్నిరకాల రంగులతో లగ్జరీ రూమ్ బ్యాంకెట్ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రారంభోత్సవానికి సినీనటుడు శ్రీకాంత్‌తోపాటు మాజీ యూపీఎస్సీ సభ్యులు, సవేరా ఆసుపత్రి ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి, హాజరుకానున్నట్లు తెలిపారు.

పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్న

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా వ్యాప్తంగా 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు అడ్మిషన్స్ చేస్తూ, అక్రమంగా పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖాజా నగర్ నారాయణ బాయ్స్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే నారాయణ విద్యా సంస్థలు విద్య మాఫియా ప్రారంభమైందన్నారు. ఈ విషయం తెలిసిన జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు చూసి ఉన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం అనంతపురం నగరంలో నారాయణ కళాశాలలో అడ్మిషన్స్ నిర్వహిస్తు, పాఠ్యపుస్తకాలు యూనిఫాం విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై జిల్లా ఇంటర్మీడియట్ ఆర్ఐఓకు ఫోన్ ద్వారా సమాచారం అందించినప్పటికీ ఆర్ఐఓ సెలవుల్లో ఉన్నాను కాబట్టి ఇప్పుడేమీ చేయలేమంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

ఉన్నతాధికారుల స్పందించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు పాఠ్యపుస్తకాలు యూనిఫాం విక్రయిస్తు కళాశాలలను షాపింగ్ కాంప్లెక్సుగా, బుక్ స్టాల్‌గా తయారు చేసిన నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల స్పందించి కార్పొరేట్ కళాశాలకు కొమ్ముకాస్తున్న ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు, గిరి, సహాయ కార్యదర్శి సూర్య, పట్టణ భీమేష్, చందు, నాయకులు మహేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

70 శాతం సబ్సిడీతో విత్తన కాయలు అందజేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కరువు జిల్లాలో రైతులకు 70 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలు సబ్సిడీతో సరఫరా చేయాలని అనంత హక్కుల పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు వ్యవసాయ శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనంత హక్కుల పోరాట సంఘం అధ్యక్షులు సోమర రాహుల్ మాట్లాడుతూ దశాబ్దాలుగా రాష్ట్రంలోనే అత్యధికంగా వేరుశనగ పంటను సాగు చేస్తున్న జిల్లాగా ఉమ్మడి అనంతపురం జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. అరకొర వర్షం మీద ఆధారపడి సాగు చేయడం వల్ల సకాలంలో వర్షం పడక అనేక సంవత్సరాల కరువు తాండవం చేస్తోందన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకపోయారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో విత్తనాలు పెట్టుబడికి కూడా ఆర్థిక స్తోమత లేని దుస్థితికి రైతాంగం నెట్టబడిందన్నారు. కరువు దృశ్యా రైతులకు కనీసం 70 శాతం సబ్సిడీతో వేరుశనగ కాయలు ఇచ్చి కరువుల ఊబిలో చిక్కుకున్న రైతన్నలను ఆదుకోవాలని కోరారు.

విత్తన వేరుశనగ నాణ్యతలో రాజీపడొద్దు

నేటి నుంచి స్లాట్ బుకింగ్ : కలెక్టర్ వినోద్‌కుమార్



లోలూరు వద్ద ఉన్న సాయి సీడ్స్ ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్‌లో విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా ఈనెల 24వతేదీ నుంచి వేరుశనగ విత్తన పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో వేరుశనగ విత్తన పంపిణీపై ఎడిఎలు, ఏఓలు, బ్యాంకర్లు, తదితర వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24వతేదీ నుంచి వేరుశనగ విత్తన పంపిణీ శాంతియుతంగా జరగాలన్నారు. ఇందులో భాగంగా శనివారం నుంచి జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రైతుల రిజిస్ట్రేషన్ మొదలు పెట్టాలన్నారు. విత్తన పంపిణీని వ్యవసాయ శాఖ అధికారులు గట్టిగా పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకూ విత్తనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులకు విత్తన పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద విత్తన పంపిణీపై అవగాహన కల్పించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాసెసింగ్ ప్లాంట్ల నుంచి రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలను ముందస్తుగానే తరలించి అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఫిర్యాదులు రాకుండా విత్తనాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విత్తనాలను అందుబాటులో ఉంచడంపై ఏపీ సీడ్స్ డిఎం వ్యక్తిగతంగా బాధ్యత తీసుకోవాలన్నారు. రూట్ల వారీగా ప్రణాళిక పెట్టుకుని విత్తనాలను ఆర్బికేలకు సరఫరా చేయాలని, విత్తల పంపిణీ కేంద్రాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. విత్తన పంపిణీని కంట్రోల్ రూమ్ నుంచి మానిటర్ చేయాలని ఏపీ సీడ్స్ డిఎం, జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల జాబితా షెడ్యూల్ చేసి రైతులకు తెలియజేయాలని, రైతుల నుంచి తీసుకున్న డబ్బుని ఏరోజుకారోజు బ్యాంకులలో డిపాజిట్ చేయాలన్నారు. అడిగినవారికి అడిగిన విత్తనాన్నే పంపించాలన్నారు. సంబంధిత ఏడిఏలు వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రాలలో సమావేశాలు పెట్టి ఏ రకమైన విత్తనం కావాలో తెలుసుకోవాలని, ఈనెల 19వ తేదీలోపు ఇందుకు సంబంధించి నివేదిక అందించాలన్నారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాలలో విత్తనాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో మౌలిక సదుపాయాలపై వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. సిసిఆర్సి కార్డులు మరింత మంది రైతులకు అందించేలా చూడాలని, వారికి బ్యాంకుల నుంచి పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా వేరుశనగ విత్తన పంపిణీకి అన్ని విధాల సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

సీడ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు

జిల్లాలో విత్తన పంపిణీ మానిటరింగ్ కోసం సీడ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు విత్తన పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లోని సీడ్ మానిటరింగ్ సెల్ నంబర్లు 08554-232922, 08554-231922కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. ఇకపోతే 0 - 0.5 ఎకరాలు ఉన్న రైతుకు 30 కిలోల బ్యాగ్ ఒకటి, 0.5- 1.0 ఎకరాలు ఉన్న రైతుకు రెండ బ్యాగులు, 1.01 ఎకరాలపైనున్న రైతుకు 3 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహులు, ఏపీ సీడ్స్ డిఎం సుబ్బయ్య, వ్యవసాయ అధికారి రాకేష్, ఎడిఎలు, ఏఓలు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ నాణ్యతలో రాజీపడొద్దు

శింగనమల : త్వరలో రైతులకు పంపిణీ చేసే సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతలో అధికారులు రాజీ పడొద్దని కలెక్టర్ వినోద్‌కమార్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని లోలూరు గ్రామం వద్ద ఉన్న సాయి సీడ్స్ ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్ కలెక్టర్ ఆకస్మింగా తనిఖీ చేశారు. ఇందలో భాగంగా ప్రాసెసింగ్ విధానాన్ని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాసెస్సింగ్ యూనిట్‌లో ఇప్పటి వరకూ కె.6 రకం వేరుశనగ 4వేల క్వింటాళ్ల రా సీడ్స్ వచ్చిందని, ఇందులో 2640 క్వింటాళ్ల ప్రాసెసింగ్ పూర్తయిందని ఎపి సీడ్స్ వారు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విత్తన వేరుశనగ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా రైతులక నాణ్యమైన విత్తనం అందచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎఒ ఆఫీస్ ఎఒ రాకేష్‌నాయక్, ఎపి సీడ్స్ అధికారులు, సీడ్స్ సర్టిఫికెట్ అధికారులు, ప్రాసెసింగ్ ప్లాంట్ ఎఒ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, ఆర్‌బికె సిబ్బంది, విఎఒ అఖిల, తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ కోసం నేటి నుంచి స్లాట్ బుకింగ్

పుట్లూరు : విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు నేటి నుంచి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ఎఒ కాత్యాయిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు వారి పరిధిలోని ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. ఖరీఫ్ సీజన్‌కు మండలానికి 100 క్వింటాళ్ల వేరుశనగ (కె-6 రకం) కేటాయించినట్లు తెలిపారు. 1 బ్యాగు (30 కిలోలు) మొత్తం ధర రూ.2850 కాగా రాయితీ ధర పోనూ రైతు వాటా రూ.1710 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే క్వింటాళ్లలో అయితే మొత్తం ధర రూ.9500 కాగా సబ్సిడీపోనూ రైతు వాటా రూ.5700 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

శింగనమల : సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు నేటి నుంచి వారి పరిధిలోని ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ అన్వేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు తమ పట్టాదాసు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

నార్పల : సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు నేటి నుంచి వారి పరిధిలోని ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి.చెన్న వీరస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు తమ పట్టాదాసు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

ఉచితంగా డ్రైవింగ్, మెకానిక్ శిక్షణ


నార్పల : జిల్లాకేంద్రంలో ఉన్న రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 20 నుంచి 30రోజుల పాటు యువకులకు కారు డ్రైవింగ్, బైక్ మెకానిక్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారై ఉండి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సంప్రదించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డిఎం

రాయదుర్గం రూరల్ : నేడు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే సెల్..99592 25863కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు.

నేరాలు ఘోరాలు

మట్టిపెళ్లలు విరిగిపడి వ్యక్తి మృతి



మృతిచెందిన రాజశేఖర్

గుమ్మఘట్ట : మండల పరిధిలోని ఆర్.కొత్తపల్లి గ్రామ చెరువులో ఇసుక తవ్వుతుండగా మట్టిపెళ్లలు విరిగిపడి రాజశేఖర్ (48) అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని గలగల గ్రామానికి చెందిన రాజశేఖర్ రోజూ ట్రాక్టర్‌లో ఇసుక వేసే పనికి వెళ్లేవాడు. ఇందులో భాగంగానే పనికి వెళ్లిన రాజశేఖర్ ఆర్.కొత్తపల్లి చెరువులో ఇసుక ట్రాక్టర్‌లోకి వేస్తుండగా ఉన్నట్టుండి మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. దీంతో ఊరిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ..వృద్ధురాలు మృతి

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని వాల్మీకి నగర్ నుంచి కాలినడకన వస్తున్న గంగమ్మ (68) గురువారం రాత్రి గుర్తు తెలియని బొలేరో వాహనం ఢీకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమీపంలో ఉన్నవారు గంగమ్మను హుటా హుటిన రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిని చంపిన కొడుకు అరెస్టు

కళ్యాణదుర్గం : కన్నతల్లిని హత్య చేసిన కేసులో తనయుడిని అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం సిఐ నాగరాజు తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఎస్ఐ ఆంజనేయులుతో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంబదూరు మండలం వైసిపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం వడ్డే సుంకమ్మను కుమారుడు వెంకటేశులు హత్య చేసిన విషయం తెలిసిందే. సుంకమ్మ భర్త రామదాసుతో తరచూ గొడవపడేది. ఈక్రమంలో సుంకమ్మ తన భర్తను గాయపరిచింది. దీంతో వెంకటేశులు కొన్నేళ్లుగా అనంతపురంలో కాపురం ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న కుమారుడు వెంకటేశులు ఈనెల 14న ఇంటికి వచ్చి తల్లితో గొడవపడి బండరాయితో మోదాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఇంట్లో సమస్యల కారణంగానే హత్య జరిగినట్లు సీఐ వివరించారు. సుంకమ్మ హత్యకు ఎలాంటి రాజకీయ పరిణామాలు లేవన్నారు.

రెండు బైకులు ఢీ..యువకునికి గాయాలు

బుక్కరాయసముద్రం : బుక్కరాయ సముద్రం మండల పరిధిలోని సంజీవపురం క్రాస్ బ్రిడ్జ్ వద్ద శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంలో నార్పల మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన రామానాయుడు కుమారుడు జగన్ గాయపడ్డాడు వెంటనే క్షతగాత్రుడిని 108 ద్వారా అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

భర్త కనబడలేదని ఫిర్యాదు

పుట్లూరు : భర్త కనబడులేదని భార్య ఫిర్యాదు చేసిన ఘటన మండల పరిధిలోని నారాయణపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. నారాయణపల్లికి చెందిన జెండా రామాంజనేయులు ఈనెల 2వ తేదీన చెన్నైలో సొంత పని నిమిత్తం వెళ్లాడని భార్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అప్పటి నుంచి తిరిగి రాలేదని తెలిపిందన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.